

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 18 పుష్పం :22 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)


**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-1-99, ఉండి.)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మన నిజమైన ఇల్లు మోక్షం. మన నిజమైన ఇంటికి వెళ్ళేవరకు ఇలా జన్మిస్తూ ఉంటాము, మరణిస్తూ ఉంటాము. దుఃఖానికి కారణం కోరిక. ఏ కోరిక అయిన అనుభవించే కొలది పెరుగుతూ ఉంటుంది. కోరికను బట్టి పునర్జన్మ వస్తుంది. నిరంతరము మనస్సు గురించి ఆలోచిస్తూ మనస్సును జయించలేము. ఏది అయితే మనం అవునో దాని గురించి శ్రవణం చేయుటం వలన, దానిని ధ్యానం చేయుటం వలన మనం కాని దానికి దూరమవుతాము..శరీరంలో ఉన్న రోగాలు అన్నీ తగ్గితే ఆరోగ్యం వస్తుంది, మనస్సులో ఉన్న రోగాలు అన్నీ పోతే మోక్షం వస్తుంది. కోపము,అసూయ,కామము ఇవి అన్నీ మనస్సులో ఉన్న పెద్ద రోగాలు. వీటి వలననే మనం దోషాలు చేస్తాము. శరీరంలో ఉన్న రోగాలు తగ్గటానికి మనం మందులు ఎలా వాడతామో అలాగ మనస్సులో ఉన్న రోగాలు తగ్గటానికి పూజ,జపం,ధ్యానం, సత్పురుషుల సహవాసం చేయాలి. ఉన్నది ఈశ్వరుడే. అహంభావన లేదు. ఇది తెలియకపోవటం వలన అహంవభావన ఉంది అనుకొంటున్నాము. ఉన్నది ఈశ్వరుడు మాత్రమే, అహంభావన లేనే లేదు అనే గాఢమైన విశ్వాసం అవసరం.

నేను ఉద్యోగం చేసుకుంటున్నాను. దానికి రాజీనామా చేసి మీ సమక్షంలో ఉండిపోవాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఎక్కడో ఉన్నాడు అనుకుంటున్నావు. ఆయన ఎప్పుడూ నీతోనే ఉన్నాడు. నువ్వు ఎక్కడో ఉన్నావు, భగవాన్ ఎక్కడో ఉన్నాడు అని అనుకోవటం వలన ప్రయాణం చేయాలి అనుకొంటున్నావు. నీవు ఎక్కడ ఉన్నావో భగవంతుడు కూడా అక్కడే ఉన్నాడు అని తెలిస్తే ఈ ప్రయాణాలు బాధలు ఉండవు అంటున్నారు భగవాన్. భగవాన్ నీకు వేరుగా లేడు. భగవాన్ అంటే చైతన్యం. ఆ చైతన్యానికి వేరుగా నీవు లేవు.. అయితే ఏదైతే నీవు కాదో అది నీవు అనుకుంటున్నావు. ఏదైతే నీవు అవునో అది నీకు తెలిసేవరకు కాని దానిని నువ్వు అనుకోవటం కోటిజన్మలు ఎత్తినా నీవు మానవు. లోపల ఉన్న చైతన్యం మనకు అనుభవంలోనికి వచ్చాక ఈ వస్తువే జన్మజన్మల నుండి మన కూడా

వచ్చి మనలను సంస్కరించి ఆ వస్తువును తెలుసుకోవటానికి సహకరిస్తోంది అన్న సంగతి ఆ వస్తువు అనుభవంలోనికి వచ్చాక నీకు తెలుస్తుంది. నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ఉద్యోగం మానక్కరలేదు. ఉద్యోగం మానివేసినంత మాత్రం చేత నీవు ఎవరో నీకు తెలియదు. దేహాభిమానం విడిచిపెట్టాలి గాని ఉద్యోగం విడిచిపెట్టనక్కరలేదు. నీ స్వరూపం నీవు తెలుసుకోవటమే మోక్షం. దీనికి వ్రతం అవసరం. అది సత్యనారాయణస్వామి వ్రతం కాదు. సత్యనారాయణస్వామి వ్రతం చేసుకోవాలంటే చేసుకో మంచిదే. కాని ఇక్కడ చెప్పే వ్రతం అది కాదు. దుర్గుణాలు, దురభ్యాసములు, దురలవాట్లలోనికి వెళ్లను అనే ధృడమైన నిశ్చయం అనే వ్రతం నీకు ఉండాలి. నీ స్వరూపంలో నుండి నీవు జారకుండా చూసుకొంటే నీవు ఎవరో నీకు తెలుస్తుంది గాని ఉద్యోగం మానివేస్తే, నీవు చేసే పని మానివేస్తే తెలియదు. నీవు ఇంటి దగ్గర ఒకలాగ ఉంటావు, ఆఫీసులో ఒకలాగ ఉంటావు. ఇంటి దగ్గర నష్టం వస్తేబాధ పడతావు, ఆఫీసులో నష్టం వస్తే నీకు బాధ రాదు. ఎందుచేతనంటే ఆఫీసులో పనిచేసేటప్పుడు నేను, నాది లేకుండా పనిచేస్తున్నావు. ఇంటి దగ్గర నేను,నాది అనే భావనతో పనిచేస్తున్నావు. నీ దుఃఖానికి కారణం నేను, నాది అనే భవనే.ఆఫీసులో నేను,నాది లేకుండా ఎలా పనిచేస్తున్నావో అలాగ ఇంటి దగ్గర కూడ పని చేస్తే నీ మనస్సు శుద్ధమవుతుంది, నీకు జ్ఞానం కలుగుతుంది. పని నీకు జ్ఞానానికి అడ్డు రాదు. నేను, నాది అనే భావన నీకు అడ్డు వస్తుంది.అందువలన ఆ తలంపును మార్చుకో నీవు స్వతంత్రుడవు అవుతావు. ఆఫీసులో కర్తలేని కర్మను చేస్తున్నావు. ఇంటి వద్ద కర్తతో కూడిన కర్మను చేస్తున్నావు. అందుచేత అక్కడ బంధింపబడటం లేదు, ఇక్కడ బంధింపబడుతున్నావు.అక్కడ లాభనష్టములు నీ మనస్సును ముట్టుకోవటంలేదు, ఇక్కడ లాభనష్టములు నీ మనస్సును ముట్టుకుంటున్నాయి. ఆఫీసులో కర్త లేని కర్మను ఎలా చేస్తున్నావో అలాగ ఇంటి వద్ద కూడాకర్త లేని కర్మను ఆచరిస్తే నీ జీవయాత్ర సుఖంగా వెళ్లిపోతుంది, దేహం శవం అయిన తరువాత మోక్షం వస్తుంది. పూర్ణ శరణాగతి అంటే నీవే ఉన్నావు, నేను లేను అని. నీవు శరణాగతి చెంది చూడు నీ విషయాలను భగవంతుడు ఎలా చూస్తాడో, నీ జీవితాన్ని ఎలా మలుపు త్రిప్పుతాడో నీ అనుభవంలో నీకే తెలుస్తుంది.

రమణ మహర్షి గారు ఇల్లు విడిచిపెట్టారు అని మనం ఇల్లు విడిచిపెట్టేస్తే జ్ఞానంరాదు కదా అజ్ఞానం పెరుగుతుంది. ఇల్లు విడిచిపెడితే జ్ఞానంవస్తే అందరూ ఇల్లు విడిచిపెట్టేయవచ్చు. ఆయన దేహ ప్రారబ్ధంలో ఇల్లు విడిచిపెట్టవలసి ఉంది ఇల్లు విడిచిపెట్టారు. మోక్షానుభవం

పొందటానికి ఏ మూలతలంపు అయితే అడ్డు వస్తుందో దాని నుండి విడుదల పొందటం వలన మోక్షం వస్తుంది గాని నీవు సన్యాసం పుచ్చుకొన్నంత మాత్రం చేత జ్ఞానం రాదు, ఇల్లు విడిచిపెట్టినంతమాత్రంచేత మోక్షంరాదు. బాహ్య ప్రక్రియల వలన జ్ఞానం రాదు. ఏ అజ్ఞానం నుండి మనం విడుదల పొందాలో అందులో నుండి విడుదల పొందితే నీవు గృహస్తుడవయినా, సన్యాసివయినా, ఇంటిలో ఉన్నా బయట ఉన్నా మోక్షం వస్తుంది. ఎందులో నుండి విడుదల పొందాలో అందులో నుండి విడుదల పొందు. ఇంటి నుండి పారిపోవటం వలన జ్ఞానం రాదు. దేని నుండి విడుదల పొందలో అది నిర్దారణ చేసుకో, ఉపాసన చేయాలి, ఒక అవతారపురుషుని గాని, గురువును గాని ఉపాసన చేస్తూఉంటే, వారు చెప్పిన మాటలను శ్రవణం చేస్తూ ఉంటే, మననం చేస్తూ ఉంటే, ఆ మాటలకు అనుగుణంగా జీవిస్తూ ఉంటే విషయాలు ఎదురుగా ఉన్నా ఆ విషయాలు ఇంద్రియాలను ఆకర్షించవు, మనస్సుకు వికారం కలుగదు. ఉపాసన వలన మోక్షం వస్తుంది. పరమేశ్వరుని చింతించకుండా పరమేశ్వరుడు తెలియబడడు. నేను గృహస్థుడను, నేను సన్యాసిని అనుకోవటం వలన ప్రయోజనం ఏమిటి? నీవు గృహస్థుడవు అయినా, సన్యాసివి అయినా నీవు ఏదైతే అవునో దానిని నిరంతరము చింతించటం వలన అదే అవుతావు.

నేను ఎవరితోను మాట్లాడను అని కుటుంబంలోని సభ్యులతో మాట్లాడటం మానివేసినంత మాత్రం చేత జ్ఞానం రాదు. కుటుంబ సభ్యులతో తగు మాత్రంగా ఉండాలి గాని అతి పనికిరాదు. అతి వలన బంధం వస్తుంది. బంధం వలన దుఖం వస్తుంది. ఏకాంతవాసం, సహవాసం అవసరమే. పదిమందిలో ఉండి మనం పని చేసినప్పుడు మనలోని బలహీనతలు తెలుస్తాయి. అసలు తత్వానికి ఆకారము లేదు. దానిని కేవలం ఒక ఆకారానికి, ఒక నామానికి, పరిమితం చేసినప్పుడు సమాజంలో పేచీలు వస్తూనే ఉంటాయి. రాజకీయాల పేరు మీద ఎంత అశాంతి ఉందో, మతాల పేరు మీద అంత అశాంతి ఉంది. ఇద్దరు ఉంటే ఒకడు ఎక్కువ, ఒకడు తక్కువ. ఉన్నది ఒక్కటే అయితే ఎక్కువ, తక్కువ ఏమిటి? నీ మాటను ప్రక్కన పెట్టి భగవంతుడు చెప్పిన మాటను అర్ధం చేసుకొని, ఆచరిస్తే అది నీకు అనుభవంలోనికి వస్తుంది. మనం బాగుపడటానికి ఒక్క మాట చాలు. నీవు పనిని విడిచిపెట్టవద్దు, మమకారాన్ని విడిచిపెట్టు. వృత్తిని విడిచిపెట్టవద్దు,అహంవృత్తిని విడిచిపెట్టు. ఇది అంతా నేను చేస్తున్నాను అనే భావనను విడిచిపెట్టు. నీ కుటుంబంలోని సభ్యులు నీ వాళ్ళు అనుకోకు, దేవుని వారు అనుకొని వారికి బట్టకొను, తిండి పెట్టు. అప్పుడు నీకు మమకారం పోతుంది.

శ్రీ పతి రూపాన్ని ధ్యానం చేసుకో. నీకు కలిగి ఉన్న దానిలో ఇతరులకు పెట్టు. నీ క్షేమం గురించి ఎలా ఆలోచించుకుంటున్నావో అలాగే ఇతరుల క్షేమం గురించి ఆలోచించు. ఎవరిని చూసి నీవు అసూయపడవద్దు. అప్పుడు నీ చైతన్యస్థాయి పెరుగుతుంది, జ్ఞానం కలుగుతుంది, తరిస్తావు. భార్య రోజూ తిడుతోంది అనుకోండి సన్యాసం పుచ్చుకుంటే బాగుండును అని కొంతమంది అనుకుంటారు. అలా కాదు. పూర్వం అనేక మంది సన్యాసం పుచ్చుకున్నా ఇంటిలోని మనుషుల మీద ద్వేషంతో, కోపంతో కుటుంబాన్ని త్యజించలేదు. గౌతమబుద్ధుడు సన్యాసం పుచ్చుకున్నాడు. అతనికి భార్య మీద కోపమా లేక ఇంటిలోని వారి మీద, ప్రజలమీద కోపమా దాని కోసం కాదు.అతని ప్రేమ, జ్ఞానం విస్తృతపరచటానికి, ఏదైతే వారు పొందారో అది ఇతరులకు ఇవ్వటం కోసం, తనంతటి వారిగా ఇతరులను చేయటం కోసం వారు సన్యాసం పుచ్చుకున్నారు గానిఎవరిమీదో కోపము వలన, ద్వేషంవలన కాదు. మనము పని చేస్తున్నాము, సన్యాసులు పనిచేస్తున్నారు. మన పరిధి తక్కువ, వారి పరిధి ఎక్కువ. వారు కర్మ ఫలాన్ని త్యాగం చేస్తున్నారు, మనం చేయటంలేదు. పని చెయ్యి, ఎలా పని చేస్తే మోక్షం వస్తుందో అలా పని చెయ్యి. ఎలా జీవిస్తే మోక్షం వస్తుందో అలా జీవించు.నీవు బ్రహ్మచారిగా ఉన్నా, గృహస్థుడుగా ఉన్నా, సన్యాసిగా ఉన్నా నీవు బ్రహ్మమే. నీవు ఏ స్థితిలో ఉన్నా బ్రహ్మమే. బ్రహ్మభావనను విడిచిపెట్టవద్దు, అఖండభావనను విడిచిపెట్టవద్దు. నీ బట్టలకు, ఉపాధికి పరిమితం అవ్వవద్దు. అన్ని ఉపాధులు మనమే అనుకుంటే ఇచ్చాము, పుచ్చుకున్నాము అనే భావన పోతుంది.

**15-3-99** నుండి 23-3-99 వరకు సూరత (గుజరాత్) క్యాంప్

**25-3-99** పాలకోడేరు లో శ్రీ నాన్నగారి ప్రవచనము

**27-3-99** జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము

**28-3-99** నుండి 8-4-99 వరకు అరుణాచలం క్యాంప్

**11-4-99** పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మంటపంలో శ్రీ నాన్నగారి ప్రవచనము.

**15-4-99** ఓడూరు లో (వయా ఆలమూరు) శ్రీ నాన్నగారి ప్రవచనము

**30-4-99** యానం లో శ్రీ నాన్నగారి ప్రవచనము

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL